
సాక్షి ఒడిశా

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,25,405లు, బంగారం 1 గ్రాముల 930 మిల్లీగ్రాములు వెండి 42 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పోలవరం ప్రాజెక్టుని వ్యతిరేకించాలి

పోలవరం ప్రాజెక్టును అన్ని స్థాయిల్లో తీవ్రంగా వ్యతిరేకించాలని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు.

- 8లో



పోస్టుల భర్తీలో అవినీతిపై ఆందోళన

వివిధ గ్రూప్–సీ పోస్టుల భర్తీ ప్రక్రియలో విస్తృతంగా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నిరుద్యోగులు మంగళవారం ఆందోళన చేపట్టారు.

- 8లో

న్యూస్‌రీల్

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



అరెస్టైన నిందితులు

రాయగడ: ఒక ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో కొత్తపేటకు చెందిన హరేంద్ర మినియాక, పి.బృందావన్ చౌదరిలు ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. ముకుందపూర్‌కు చెందిన శ్రీయ హిమిరక అనే విద్యార్థిని అమలాభట్టలో తన పినతండ్రి ఇంట్లో ఉండి చదువుకుంటోంది. ఈ క్రమంలో తన ఆరోగ్యం బాగులేకపోవడంతో ఆగస్టు 26వ తేదీన తన సొంత ఊరికి వెళ్లింది. తిరిగి ఈనెల 8వ తేదీన మరలా ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గమనించి, ఈనెల 9వ తేదీన చందిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోని తన ల్యాప్‌టాప్, మరికొన్ని వస్తువులు దొంగతనానికి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకుని వారి నుంచి ల్యాప్‌టాప్, ఇన్వర్టర్, ఎస్‌ఎఫ్ బ్యాటరీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని 10వ తేదీన కోర్టుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



ఆస్పత్రి వద్ద టున్న మృతదేహం

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీస్‌స్టేషన్ పరిధి బీజేపూర్ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలు పాలయ్యారు. మృతుడు అంబొదల గ్రామానికి చెందిన టున్న స్వయిగా గుర్తించారు. గాయాలు పాలైన వ్యక్తి గుడ భోయ్‌ను అంబులెన్స్ సాయంతో అంబొదల ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టున్న, గుడలు బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో టున అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి



మృతి చెందిన ఏనుగు

భువనేశ్వర్: విద్యుత్ తీగ తాకడంతో షాక్‌తో ఆడ ఏనుగు మృతి చెందింది. రౌర్కెలా లఠికోట మండలం నువాగాంప్ పంట పొలాల్లో దీని కళేబరం గ్రామస్తులు గుర్తించారు. విషయం తెలియడంతో స్థానిక అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలం సందర్శించి కళేబరం స్వాధీనపరచుకుని విచారణ చేపట్టారు

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



షాపులో ఎగసిపడుతున్న మంటలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్న ఒక చెప్పుల షాపులో వర్షాలకు గోడలు బాగా తడిచిపోవడం వలన షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లక్షలాది రూపాయలు సరుక బూడిద అయ్యింది. మంటలపై స్థానికులు యజమానికి తెలుపగా, అతను అగ్నిమాపక బృందానికి సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేశారు.

జల దిగ్బంధం..!



మల్కన్‌గిరి: కంగూర్ కొండ వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

రాష్ట్రంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కకున్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. పలుచోట్ల రహదారులు కోతకు గురవ్వడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. వంతెనలపై వరద నీరు ప్రవహిస్తుండడంతో బయట ప్రపంచంతో పలు గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. అగ్నిమాపక దళాలు, ఓడ్రాప్ బృందాలు సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నాయి.



జయపురం: ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

- ముంపులోనే పలు గ్రామాలు
- కోతకు గురైన రహదారులు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

రాయగడ: ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా జిల్లాలోని మునిగుడ సమితి టికిరపడ ఆదివాసీ వీధి జల దిగ్బంధంలో చిక్కుకుంది. వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో ఇంట్లోని విలువైన వస్తువులు తడిచి ముద్దయ్యాయి. సుమారు 50 కుటుంబాలకు పైగా ఇక్కడ నివస్తున్నారు. అంతా రెక్కడితే గాని డొక్కాడని జీవితాలు. వీరంతా ఇంట్లో తడిచి ముద్దయిన సామగ్రిని చూసి లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి. మరోవైపు వర్షపు నీరు చేరడం వలన విష సర్పాలు, పురుగులు ఇంట్లోకి చొరబడుతున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కొరుతున్నారు.

జయపురంలో తీవ్రనష్టం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితిలోని 20 పంచాయతీల్లో వర్షాలతో తీవ్ర నష్టం ఏర్పడినట్లు అధికారులు తెలియజేశారు. కుకుటగడ్ నది ఎగువ ప్రాంతం నుంచి కొండవాగు నీరు ఎక్కువగా ప్రవేశించడంతో చంద్రపడ పంచాయతీ బెజాగుడ–కొషిగుడ రోడ్డులో గండి పడింది. ఆ మార్గంలో ఒక కల్వర్ట్ కొట్టుకుపోవడంతో బణువగుడ, డుమురిగుడ గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. దసమంతపూర్ పంచాయతీ బగ్రగుడ–కందుగుడ మధ్య వంతెన కూలి పోయిందని తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల్లో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, అధికారులు పర్యటించి పరిశీలించారు.



మల్కన్‌గిరిలో ముంపునకు గురైన పంటపొలాలు

తెలింగిరి ప్రాజెక్టు ఒక గేటు ఎత్తివేత

జయపురం: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితిలోని తెలింగిరి సాగునీటి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరింది. దీంతో జలాశయంలో ఒక గేటును మంగళవారం ఎత్తి నీటిని దిగువకు విడిచిపెట్టారు. డ్యామ్ సాధారణ నీటి మట్టం 613.50 మీటర్లు కాగా, అత్యధిక నీటిమట్టం 633 మీటర్లు అని వెల్లడించారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో 631.89 మీటర్లు ఉందన్నారు. డ్యామ్‌కు ప్రతి సెకన్‌కు 44.33 క్యూసెక్కుల నీరు చేరుతోందని, ఒక గేటు తెరవడంతో 59.73 క్యూసెక్కుల నీరు వెళ్తోందని పేర్కొన్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరికొన్ని గేట్లు తెరుస్తామని అధికారులు వెల్లడించారు.

స్పెషల్ రిలీఫ్ కమిషనర్ పర్యటన

మల్కన్‌గిరి: జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో స్పెషల్ రిలీఫ్ కమిషనర్ విష్ణుపతి శెట్టి మంగళవారం పర్యటించారు. ముందుగా పలు పునరావాస కేంద్రాలను సందర్శించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. మల్కన్‌గిరి, మత్తిలి, కలిమెల, పోడియా సమితుల్లో 13 గ్రామాలు పూర్తిగా నీటి ముంపునకు గురయ్యాయన్నారు. మొత్తం 116 ఇళ్లు దెబ్బతిన్నాయని వెల్లడించారు. 14 చోట్ల రహదారులు కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగిందని వివరించారు. దీనిని అధిగమించేందుకు 6 ఓడ్రాఫ్ బృందాలు, 7 అగ్నిమాపక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అలాగే వ్యాధులను అరికట్టేందుకు 14 వైద్య బృందాలను నియమించామన్నారు. పునరావస కేంద్రాల్లోని ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా విధుల్లోనే ఉండాలని స్పష్టం చేశారు.



మల్కన్‌గిరి: బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం



1. మల్కన్‌గిరి: భయఫోడ్ వద్ద విరిగిన రహదారి
2. జయపురం: కుకుటగడ్ నదిపై వరద నీరు
3. జయపురం: బాగ్దేరి వంతెనపై పారుతున్న వరద నీరు
4. జయపురం: సొలప గ్రామంలో నేలమట్టమైన ఇల్లు



మల్కన్‌గిరి: పొట్టేరు వద్ద ప్రవహిస్తున్న నీరు



మల్కన్‌గిరి: కోతకు గురైన రహదారి



రాయగడ: ఆదివాసీ వీధిలో నిల్వ ఉన్న నీరు



మల్కన్‌గిరి: సమావేశంలో పాల్గొన్న కమిషనర్ విష్ణుపతి శెట్టి తదితరులు

వరదపై సీఎం సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో భారీగా వర్షాలు కురవడంతో వరద ప్రభావంపై సీఎం మోహన్ చరణ్ మాఝీ తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్‌ఆర్‌సీ) దేవ్ రంజన్ కుమార్ సింగ్, అదనపు డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బాధిత ప్రాంతాలకు సరిపడా ఆహార, ఔషధ నిల్వలు, సహాయక సామగ్రి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలను యద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఆపదలో ఉన్న ప్రజలకు సాయం అందజేయాలని సూచించారు.

మల్కన్‌గిరిలో అత్యధికం

సమీక్షలో మంత్రి సురేష్ కుమార్ పూజారి మాట్లాడుతూ మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. మల్కన్‌గిరి జిల్లాకు ఓడ్రాఫ్, అగ్నిమాపక బృందాలను పంపించినట్లు పేర్కొన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించామన్నారు. కొండ చరియలు విరిగిపడడంతో ఒకరికి గాయాలైనట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా అల్పపీడనం గత ఆరు గంటల్లో గంటకు 22 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ, వాయువ్య దిశగా కదిలి మంగళవారం ఉదయం 5.30 గంటలకు ఉత్తర ఛత్తీస్‌గఢ్, దానిని ఆనుకుని ఉన్న ఒడిశా మీదుగా ఝూర్సుగుడకు పశ్చిమ, నైరుతి దిశలో 90 కిలో మీటర్లు, సంబల్‌పూర్‌కు పశ్చిమ, వాయువ్యంగా 70 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతూ ఛత్తీస్‌గఢ్, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా బాగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం.

సీఎం మోహన్ చరణ్‌కు ఆహ్వానం

భువనేశ్వర్:

ఈనెల 15న రాష్ట్రంలో కొత్తగా మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ప్రారంభించనున్నారు. ఈ రైలు బరంపురం నుంచి టాటానగర్ మధ్య నడుస్తుంది. ఈ సందర్భంగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుని ప్రారంభించేందుకు హాజరవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ మంగళవారం ఆహ్వానించారు. ఈనెల 15న దేశంలో కొత్తగా 10 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. వీటిలో ఒకటి బరంపురం నుంచి ప్రారంభం అవుతుండగా, మరో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఒడిశా గుండా రాకపోకలు చేయనున్నాయి. ఈ జాబితాలో రౌర్కెలా – హౌరా, దుర్గ్ – విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి.



సీఎంకు ఆహ్వానం అందజేస్తున్న పరమేశ్వర్ ఫంక్వాల్

క్లుప్తంగా

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో ఇరువర్గాల మధ్య వ్యవసాయ భూమి విషయమై కొట్లాట జరిడింది. ఒకరిపై ఒకరు కత్తులతో దాడులు చేసుకోవడంతో జాయి అప్పలనాయుడు, అగతమూడి ప్రభావతిలు తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఐ ఎంఏ అహమ్మద్ చెప్పారు. బాధితులకు స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

దుర్గాదేవి ఆలయంలో చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని దోమాం పంచాయతీ కొంచాలకూర్మయ్యపేట దుర్గాదేవి ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి తాళాలు బద్దలగొట్టి గుడి తలుపులు తీసి బీరువా పగలుకొట్టారు. అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి, తులం బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. మంగళవారం ఆలయం తెరిచేందుకు వెళ్లగా తాళాలు బద్దలకొట్టి ఉండటంతో ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగ రెడ్డి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని బన్నువాడ గ్రామానికి చెందిన ఎన్ని గణపతిరావు ఈ నెల 1న కుటుంబ సమస్యల కారణంగా పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం బెల్టుషాపుపై దాడి

టెక్కలి రూరల్: స్థానిక భవానీనగర్ సమీపంలో పాన్ షాపు పేరుతో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపుపై పోలీసులు మంగళవారం దాడిచేశారు. 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్మకాలు సాగిస్తున్న గూడ తవుడు, అంకులపిట్ట పూర్ణచంద్రలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన టీచర్‌పై ఫిర్యాదు

టెక్కలి రూరల్: టెక్కలి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న తమ కుమారుడు మోక్షిత్‌ను ఉపాధ్యాయుడు పల్లి వేణుగోపాల్‌రావు తీవ్రంగా కొట్టారంటూ విద్యార్థి తల్లిదండ్రులు సుధీర్, సుకన్యలు మంగళవారం ఎంఈఓ దల్లి తులసీరావుతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హోమ్‌వర్క్ చేయలేదని విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంఈఓ వద్ద ప్రస్తావించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిద్ర మత్తులో కానిస్టేబుల్!

- పరారైన గంజాయి సరఫరాదారుడు

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జిల్లాకేంద్రంలో 22 కిలోల గంజాయితో పట్టుబడిన తొమ్మిది మంది యువకులను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మరో ముగ్గురు దొరకాల్సివుందని ఎస్పీ విలేకరుల సమావేశంలో చెప్పారు. అయితే దీనికి ముందు రోజు, విచారణ నిమిత్తం ఒకటో పట్టణ పోలీసుల అదుపులో ఉన్న ఓ యువకుడు పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన తొమ్మిది మందితో పాటు నగరానికి చెందిన గంజాయి సరఫరా చేసే మరో యువకున్ని పోలీసులు అదే రోజు అదుపులోకి తీసుకున్నారు. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఆ యువకుడు తప్పించుకుని పారిపోయినట్లు తెలుస్తోంది. సదరు యువకుడు మృతిచెందిన ఓ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు అన్న విషయం తెలియడంతో పోలీసులే తప్పించారా..? అనే కోణం కూడా నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం జిల్లా ఎస్పీ దృష్టికి అప్పట్లోనే వెళ్లడంతో సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

సిక్కోలు పోరాట యోధుడు కుమారన్న



మాట్లాడుతున్న తాండ్ర ప్రకాష్

పలాస: మండలంలోని బొడ్డపాడు గ్రామానికి చెందిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట యోధుడు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న వర్ధంతి సభ మంగళవారం లొత్తూరు పంచాయతీ పెదగంతరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్రప్రకాష్ మాట్లాడు తూఅమరుల త్యాగాల బాటలో నేటి తరం నడుచుకొని గిరిజన హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కుమారన్న జయక్క స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పి.ఓ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సవలాపురపు కృష్ణవేణి, కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతలపల్లి కుసుమ, ప్రజాసంఘాల నాయకులు అరుణ, నీలకంఠం, సన్యాసిరావు, నేతింటి నీలంరాజు, కుత్తుం వినోద్, బర్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

పడిగాపులు..!



రాష్ట్రంలో సుభద్ర యోజన నమోదుకు ప్రభుత్వం దరఖాస్తులు కోరుతున్న విషయం తెలిసిందే. దీంతో పట్టణంలోని జనసేవ కేంద్రాలు, పోస్టాఫీసు, సీఎస్‌సీ కేంద్రాలు, బ్యాంకుల్లో ఆధార్ అప్‌డేట్, ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్, దరఖాస్తులు చేసుకోవడానికి మహిళలు బారులు తీరుతున్నారు. అయితే దరఖాస్తులు అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అందువలన సులభతరం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈనెల 17వ తేదీన ఈ పథకాన్ని పీఎం నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

- పర్లాకిమిడి





పోలవరం ప్రాజెక్టుని వ్యతిరేకించాలి

- మాజీ సీఎం నవీన్ పట్నాయక్



నవీన్ పట్నాయక్‌కు నివేదిక సమర్పిస్తున్న బీజేడీ బృందం

భువనేశ్వర్: పోలవరం ప్రాజెక్టును అన్ని స్థాయిల్లో తీవ్రంగా వ్యతిరేకించాలని బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. బీజేడీ ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో పోలవరం ప్రాజెక్టును ఇటీవల పరిశీలించి సమీక్షించింది. ఈ మేరకు స్థానిక నవీన్ నివాస్‌లో మంగళవారం బీజేడీ పోలవరం బృందం తన నివేదికను పార్టీ అధ్యక్షుడికి సమర్పించింది. మల్కన్‌గిరి జిల్లా మోటు పంచాయతీతో సహా కలిమెల, పొడియా మండలాల్లో 236 గ్రామాల ప్రజల జీవితాలపై పోలవరం ప్రాజెక్ట్ ప్రతికూల ప్రభావం చూపుతుందని బృందం పేర్కొంది. ప్రాజెక్ట్ ప్రాంతంలోని వాస్తవ పరిస్థితులు సమీక్షించిన మేరకు ఈ విషయం స్పష్టమైనట్లు బృందం పేర్కొంది. మలక్‌న్‌గిరి జిల్లాలో సాధారణంగా గణనీయమైన వర్షపాతం నమోదవుతుంది. పోలవరం ప్రాజెక్ట్ ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని పేర్కొంది. పార్లమెంట్ నుంచి శాసనసభ వరకు, పంచాయతీ పరిధిలో అన్ని స్థాయిల్లో ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించాలని బృందానికి తెలిపారు. గిరిజనుల ప్రయోజనాల పరిరక్షణకు బిజూ జనతా దళ్ నిరంతరం ప్రాధాన్యత కల్పిస్తుందని, ఆదివాసీల హక్కుల కోసం పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బీజేడీ పోలవరం బృందం చైర్మన్ డాక్టర్ దేబీ ప్రసాద్ మిశ్రాతో పాటు ఎంపీ మున్నా ఖాన్, ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ మంత్రి అతున్ సబ్యసాచి నాయక్, మాజీ ఎమ్మెల్యే జిన్నా హికాకా, భృగు బక్షిపాత్రొ, మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ, బీజేడీ మీడియా సమన్వయ కర్త ప్రియవ్రత్ మాఝీలు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్, ఎంక్వైరీ, టిక్కెటింగ్ కౌంటర్, బయట పార్కింగ్ స్థలాలని సందర్శించారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు ఇంచుమించు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే స్టేషన్ ఓవర్ బ్రిడ్జి, సెకండ్ ప్లాట్ ఫారం పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు

రాయగడ: జిల్లాలోని రాయగడ, గుడారి, బిసంకటక్ తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 193 లీటర్ల నాటుసారా, 2,250 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకుని, అందుకు సంబంధించిన నలుగురుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నాటుసార అక్రమ రవాణా, తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని ఓఐసీ సంజయ్ ప్రధాన్ తెలియజేశారు. అరెస్టైనవారిలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.



నాటుసారాతో పట్టుబడిన వ్యక్తులు

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా బెత్నొనట్టి పోలీసు ఠాణా పరిధిలోని ఖొడిసల్ పంచాయతీ డ్రంపడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పొలంలో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పిడుగుపాటుకు మృతి చెందారు. మృతులను బెత్నొనట్టి ఖుదురిబాణి గ్రామానికి చెందిన గోబింద మహంత (52), శంఖజోడా గ్రామానికి చెందిన శిబ హంసదా (30)గా గుర్తించారు.

పండితులకు సత్కారం



భాస్కరాచార్యుల దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం నిర్వహించిన వినాయక చవితి త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పలువురు పండితులను సత్కరించారు. సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆగమ శాస్త్ర పండితులు పీవీ భాస్కరాచార్యులు, వేదపండితులు పులఖండం గణపతి శాస్త్రి, సీనియర్ సభ్యులు సుసర్ల రామప్రసాదరావు, గరిమెళ్ల వెంకట రమణ మూర్తి, భాగవతుల సుబ్రహ్మణ్య శాస్త్రిలను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

13 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 బాల బాలికలకు జిల్లాస్థాయి ఎంపిక తేదీలను స్కూల్ గేమ్స్ అధ్యక్షుడు, డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, కార్యదర్శి బీవీ రమణ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 30 వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో వివిధ జిల్లాల్లో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు పంపిస్తామన్నారు. అండర్-14 విభాగానికి 2011 జనవరి ఒకటి తర్వాత, అండర్-17 విభాగానికి 2008 జనవరి ఒకటి తర్వాత , అండర్-19 విభాగానికి 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు.

అమె నేత్రాలు సజీవం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పంచాయతీ సాయినగర్ కాలనీకి చెందిన ఉప్పలపాటి సావిత్రమ్మ (70) మంగళవారం మృతి చెందారు. ఈమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయాలని నిర్ణయించి రెడ్‌క్రాస్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే నేత్ర చికిత్స నిపుణులు సుజాత బృందం ఎచ్చెర్లలో సావిత్రమ్మ ఇంటికి వచ్చి కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు అభినందించారు. నేత్ర దానం చేయాలనుకుంటే 7842699321 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వృద్ధురాలి ఆచూకీ కోసం గాలింపు

పోలాకి(నరసన్నపేట): మండలంలోని కొల్లివలస వద్ద ముప్పిడి గ్రామానికి చెందిన డొంకాన లక్ష్మీదేవి పోలాకి ఓపెన్ హెడ్ చానెల్లో రెండు రోజుల కిందట గల్లంతయ్యారు. ఈమె ఆచూకీ కోసం మంగళవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. తహసీల్దార్ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

పోస్టుల భర్తీలో అవినీతిపై ఆందోళన



ఆందోళన చేపడుతున్న నిరుద్యోగులు

భువనేశ్వర్: వివిధ గ్రూప్-సీ పోస్టుల భర్తీ ప్రక్రియలో విస్తృతంగా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ నిరుద్యోగులు స్థానిక ఒడిశా సబ్-ఆర్డినేట్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఓఎస్ఎస్ఎస్‌సీ) కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. కంబైన్డ్ ఎగ్జామినేషన్ గ్రూప్-సీ ఫలితాల మెరిట్ లిస్ట్‌లో చాలా మంది పేలవమైన విద్యార్థులు ఉత్తీర్ణులుగా చోటు సంపాదించారని ఆందోళనకారులు పేర్కొన్నారు. ఫారెస్టర్, ఫారెస్ట్ గార్డ్, లైవ్‌స్టాక్ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్టుల రాత పరీక్షలు పురస్కరించుకుని ఉద్యోగాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని మండిపడ్డారు. ఫలితాల వెల్లడి తర్వాత అభ్యర్థులు సాధించిన మార్కులు విడుదల చేయకపోవడం దీనికి తార్కాణంగా పేర్కొన్నారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫారెస్టర్, ఇతర పోస్టుల పరీక్షలను రద్దు చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

స్థల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ పట్వారి

రాయగడ: జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయ భవనం నిర్మాణానికి స్థల పరిశీలన జరిగింది. కలెక్టర్ ఫరూల్ పట్వారి ఈ మేరకు సంస్కృతీ భవనం వెనుకనున్న స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించి అవసరమయ్యే నిధులను ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిఫారసు చేస్తానని ఆమె అన్నారు. జిల్లాగా ఆవిర్భవించి ఇన్నేళ్లు అయినప్పటికీ డీపీఆర్వో కార్యాలయం లేకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, జిల్లా సంస్కృతీ శాఖ అధికారి సుచిత్ర బౌరి, ఆర్అండ్‌బీ ఎస్డీవో తదితరులతో నిర్మాణానికి సంబంధించి చర్చించారు.

తాటి విత్తనాలకు రూ.510 కోట్లు ఖర్చు

భువనేశ్వర్: మెరుపులు, ఉరుములతో కూడిన పిడుగులతో ప్రాణాలను రక్షించే చొరవలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం 30 జిల్లాల్లో 18.75 లక్షల తాటి విత్తనాలను నాటినట్లు అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ కుంటియా తెలిపారు. రాష్ట్ర శాసన సభలో అఠొగొడా నియోజకవర్గానికి చెందిన బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వంయి అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంలో దీనికోసం రూ. 510.96 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.

మంకీ ఫాక్స్‌పై ఆందోళన వద్దు

- రాష్ట్ర ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్ బిజయ్ మహాపాత్రో

భువనేశ్వర్: దేశంలో మంకీపాక్స్ ఉనికి ఖరారవ్వడంతో సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ బిజయ్ మహాపాత్రో మంగళవారం తెలియజేశారు. దేశంలో వెలుగు చూసిన మంకీపాక్స్ రోగిని నియంత్రణలోకి తీసుకుని పటిష్టమైన చికిత్స విధానాల మధ్య వైద్య సేవలను అందజేస్తున్నారని వివరించారు. స్పష్టత ఖరారయ్యేంత వరకు ఈ ప్రక్రియ నిరవధికంగా కొనసాగుతుందన్నారు. సాధారణంగా మంకీపాక్స్ వైరస్ సోకి బహిర్గతమయ్యే 7 నుంచి 10 రోజుల వరకు వ్యాధి సోకిన వ్యక్తి బాగానే ఉంటాడని అనుబంధ వర్గాలు తెలిపాయి. అనంతరం జ్వరం, తల నొప్పి, కండరాల నొప్పి, నొప్పి కలిగించే కురుపులు పుడతాయన్నారు. వ్యాధిని ఎదుర్కోవడానికి అన్నివిధాలుగా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

15 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశం
- డెంకనాల్ సామూహిక అత్యాచారంపై సీరియస్

భువనేశ్వర్: ఢెంకనాల్ సామూహిక అత్యాచారం కేసుకు సంబంధించి 15 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ (ఎస్‌సీడబ్ల్యూ) జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)ని ఆదేశించింది. అత్యాచారం బాధితురాలిని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మీనతి బెహరా మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ మద్కర్ సందీప్ సంపత్‌ను ఆదేశించినట్లు తెలిపారు. బాధితురాలు గౌరవంగా జీవించేందుకు తగిన పరిహారం అందజేస్తామన్నారు. నిందితులను శిక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఘటనపై లోతుగా విచారిస్తున్నట్లు ఢెంకనాల్ అదనపు ఎస్పీ సూర్యమణి ప్రధాన్ తెలిపారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఢెంకనాల్ ఎస్పీతో మాట్లాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఎస్పీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణ జరిపి ఛార్జిషీట్‌ను త్వరగా సమర్పిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ఈ కేసులో 5వ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేరంలో ప్రమేయం ఉన్న మరికొందరిని పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఢెంకనాల్ జిల్లా మహులపుంజి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించేందుకు కృషి చేస్తున్నారు. త్వరితగతిన విచారణ జరిగేలా చూస్తున్నట్లు మహిళా కమిషన్ అధ్యక్షురాలికి వివరించారు.

వికల్ప సంస్థ ఔదార్యం



వృద్ధ మహిళకు ఇల్లు అందించిన సబ్ కలెక్టర్ కల్యాణి తదితరులు

రాయగడ: పట్టణంలోని వికల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిరుపేద వృద్ధ మహిళకు ఇంటిని నిర్మించి ఔదార్యం చాటుకుంది. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న కె.సీతమ్మ అనే వృద్ధ మహిళ పరిస్థితిని చూసిన వికల్ప సంస్థకు చెందిన సభ్యులు, చేయిచేయి కలిపి సేకరించిన విరాళాలతో ఇల్లు కట్టించి ఇచ్చారు. అదే ప్రాంతానికి చెందిన జాను నీలకంఠం అనే వ్యక్తి ఉచితంగా స్థలాన్ని సంస్థకు ఇవ్వగా, ఆ స్థలంలో చిన్న ఇంటిని నిర్మించి సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన డాక్టర్ పి.కె.గంతాయిత్, డాక్టర్ దుస్మంత్ కుమార్ మహంతి. జగదీష్ చంద్ర దొర, జి.గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

- డాక్టర్ ప్రదీప్త కుమార్ సుబుద్ధి



డాక్టర్ సుబుద్ధికి స్వాగతం పలుకుతున్న రాజేష్ పాఢి

రాయగడ: క్షణికావేశంతో ఎవరూ ప్రాణాలను తీసుకోవద్దని జిల్లా కేంద్రాస్పత్రి అదనపు ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్త కుమార్ సుబుద్ధి సూచించారు. స్థానిక పితామహల్‌లోని సెంచురియన్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జిల్లా ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం యువత ఆత్మహత్యలకు ఎక్కువగా పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దానిని ధైర్యంగా ఎదుర్కోవాలని, అలాగే తమ సన్నిహితులతో సమస్యను పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ రాజేష్ పాఢీ, నర్సింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు విశేష స్పందన



రాయగడ: ఎస్‌హెచ్‌జీ మహిళలకు చెక్కు అందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ సమితి పర్తాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ సోమవారం నిర్వహించారు. ప్రజల వినతులు స్వీకరించడానికి ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గ్రామాణాభివృద్ధి అదనపు సీడీఎం పృథ్వీరాజ్ మండల్ తదితరులు హాజరయ్యారు. కాశీనగర్ సమితిలోని ఖరడ, పర్తాడ, రాణిపేట, సిద్ధమణుల పంచాయతీల నుంచి 173 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, బీడీవో డంబుధర మల్లిక్, తహసీల్దార్ అశోక్ కుమార్ ప్రధాన్, సర్పంచ్ కుమారి రైయితో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 102 వినతులను ఆమె స్వీకరించారు. 10 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా 8 ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలకు రూ.8.50 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బిసి, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, సమితి అధ్యక్షుడు కొంతా మఝి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

క్లుప్తంగా

తుపాను ప్రభావంతో 10 మేకల మృతి



చనిపోయిన మేకలు

బొండపల్లి: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు బొండపల్లి మండలంలోని కెరటాం గ్రామంలో సోమవారం రాత్రి 10 మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన నీలాతి అప్పన్న గ్రామం సమీపంలోకి మేకల మందను తోలుకుని వెళ్లి అక్కడికి సమీపంలోనే ఆరుబయట మందను ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురవడంతో ఆ వర్షానికి 10 మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని మంగళవారం గ్రామంలోకి వచ్చి వెటర్నరీ వైద్య సిబ్బందికి తెలియచేయడంతో బొండపల్లి పశు వైద్యాధికారి ఎం.కిరణ్ కుమార్ చనిపోయిన మేకలను పరిశీలించారు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ డి.రాజేశ్వర రావు గ్రామానికి వచ్చి చనిపోయిన మేకలను పరిశీలించి నివేదికను తయారు చేసి ఇవ్వాలని వెటర్నరీ వైద్య సిబ్బందికి సూచించారు. చనిపోయిన మేకల విలువ రూ.లక్షా యాభై వేలకు పైగానే ఉంటుందని తీవ్రంగా నష్టపోయిన తనను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

12న జాబ్‌మేళా

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ప్రభుత్వ ఐటీఐ కంచరపాలెం, విశాఖపట్నంలో ఈనెల 12 వతేదీన ఉదయం 9 గంటల నుంచి ఆశోక్ లేలాండ్ కంపెనీ జాబ్ ఫేర్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్ టీవీ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లలో ఐటీఐ పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థి వయోపరిమితి 26 సంత్సరాలు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులు దుబాయిలోని యుఏఈలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాస్‌పోర్టు ఉన్న వారికి, 2 ఏళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఫోన్ 94401097068 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మండలంలోని కొండకరకాం జంక్షన్ వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం చోరీకి గురైంది. రెండు నెలల వ్యవధిలో విజయనగరం మండల పరిధిలో 8 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడంతో విద్యుత్ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ 100కు వచ్చిన ఫోన్ ద్వారా అందుకున్న సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. సమీపంలో విచారణ చేయగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వకేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

వంశధారకు వరద

- అప్రమత్తమైన అధికారులు



ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వ్యూయర్ వద్ద వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖరం, వీఆర్‌ఓలు

భామిని: వంశధార నది ఎగువ భాగమైన ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం నదిలోకి వరద నీటి తాకిడి పెరిగింది. భామిని మండలంలో వర్షాల తాకిడి తగ్గినప్పటికీ నదిలో వరద పెరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నదిలోకి సుమారు 12 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు తహసీల్దార్ నిమ్మల శేఖరం ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం కాట్రగడ-బి ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వ్యూయర్‌లో వరదనీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఇప్పటికే సైడ్ వ్యూయర్‌లో తీసిన ఇసుక మేటలు వరద నీటిలో కొట్టుకుపోయిన విషయాన్ని వీఆర్‌ఓలు తహసీల్దార్‌కు తెలియజేశారు. తీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని వీఆర్‌ఓల ద్వారా తహసీల్దార్ దండోరా వేయించారు. వంశదార డీఈఈ భవానీ శంకర్ ఆధ్వర్యంలో ఏఈఈలు జగదీష్ బాబు, సునీతా కిరణ్‌లు ఓపెన్ హెడ్ చానల్‌లోకి వరదనీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు.

రక్తదాహం..!

- రక్తం ఇవ్వకుండా ఎగ్గొడుతున్న ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులు



ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో భద్రపరిచిన బ్లడ్ ప్యాకెట్స్



రక్తం ఇస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: మనిషి జీవించడానికి ప్రధానమైనది రక్తం. ఇది సరిపడిన మోతాదులో ఉంటే ఆరోగ్యంగా జీవిస్తాడు. లేదంటే అనారోగ్యం బారిన పడతాడు. శరీరంలో రక్తం గణనీయంగా తగ్గిపోతే చనిపోతారు. రక్తహీనత ఉన్న రోగులకు రక్తం సకాలంలో ఎక్కించగలిగితే ప్రాణాలు నిలుస్తాయి. ముఖ్యంగా పేదరోగులు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతారు. వారికి రక్తం అవసరమైనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లయితే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ నుంచి ఉచితంగా రక్తం అందిస్తారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం తెచ్చుకోవాలంటే టెస్టింగ్ చార్జీల కింద డబ్బులు కట్టాల్సిన పరిస్థితి. పేద వారికి ఇది తలకు మించి భారం అవుతుంది. కాబట్టి రోగులు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లకు రక్తం కోసం ఎక్కువగా వస్తారు. దీని వల్ల ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఎక్కువగా వినియోగమవుతుంది.

ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లు ఇచ్చిన రక్తం వివరాలు

బ్లడ్ బ్యాంక్	సేకరించింది (యూనిట్లు)	ఇవ్వాల్సింది (యూనిట్లు)	ఇచ్చింది (యూనిట్లు)
రెడ్‌క్రాస్ సొసైటీ	367	110	15
ఎస్‌వీఎస్	108	32	10
న్యూలైఫ్	31	9	10
రోటరీ	34	10	13
బొబ్బిలి	12	4	0
విజయ	00	00	25

30 శాతం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు ఇవ్వాలి

రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తంలో ప్రైవేట్ బ్లడ్‌బ్యాంక్‌లు 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు ఇవ్వాలి. కానీ ఇది జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు. నిబంధన ప్రకారం రక్తదాన శిబిరం నిర్వహించిన రోజే 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు తెచ్చి ఇవ్వాలి. కానీ ఆ విధంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏప్రిల్ నుంచి జూలై వరకు 552 యూనిట్స్ సేకరణ

జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరు నాటికి 552 యూనిట్ల రక్తాన్ని సేకరించాయి. 30 శాతం ప్రకారం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు 166 యూనిట్ల రక్యం ఇవ్వాలి. అయితే 73 యూనిట్లు మాత్రమే ఇచ్చాయి. మిగిలిన 93 యూనిట్లు ఇవ్వలేదు.

జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లు

జిల్లాలో మిమ్స్, ఎస్‌వీఎస్, విజయ, రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ బ్లడ్ బ్యాంకులు, బొబ్బిలి బ్లడ్ సెంటర్, న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్ ఉన్నాయి.

'సూర్యఘర్' సబ్సిడీ వినియోగించుకోవాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం సూర్య ఘర్ సబ్సిడీని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా విద్యుత్ శాఖ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్ మనం వాడుకోగా మిగిలిన విద్యుత్‌తో ఆదాయం వస్తుందన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ కృషిచేయాలని ఆదేశించారు. రానున్న మూడు నెలల్లో 1000 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం పూర్తిచేయాలని విద్యుత్, మునిసిపాలిటీ సంస్థలను ఆదేశించారు.

మోడల్ సోలార్ గ్రామాన్ని గుర్తించాలి

ఇంటిపై సోలార్ యూనిట్ పెట్టుకునేందుకు అవకాశం గల ఇళ్లను గుర్తించి సచివాలయ సిబ్బంది ద్వారా వారికి అవగాహన కల్పించి దరఖాస్తు చేయించాలన్నారు. గృహసముదాయాలు, ఆస్పత్రులు , దుకాణ సముదాయాల్లో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మోడల్ సోలార్ గ్రామం ఏర్పాటుకు అవకాశం గల గ్రామాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు.

45 రోజుల్లో సబ్సిడీ జమ

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు పథకం వివరాలను తెలియజేశారు. వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.1300 ఫీజు చెల్లించిన పిదప మాత్రమే దరఖాస్తు ప్రాసెస్ అవుతుందని తెలిపారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ. 60వేలు, మూడు కిలోవాట్ల రూ.78వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వివరించారు. యూనిట్ స్థాపించిన 45రోజులలో సబ్సిడీ వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమవుతుందని తెలిపారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందని, పెట్టుబడి మొత్తం మూడు లేక నాలుగు సంవత్సరాలలో తిరిగి వచ్చేస్తుందని వివరించారు. సమావేశంలో పార్వతీపురం విద్యుత్ శాఖ ఈఈ కె.గోపాలరావు నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- డీఈవో ప్రేమ్‌కుమార్



ఉపాధ్యాయులతో సమీక్షలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రామభద్రపురం: పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు రామభద్రపురంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని, రికార్డులు పరిశీలించారు. రెండు రోజుల ముందు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఇక్కడి పాఠశాలకు పంపించి విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయి? ఉపాధ్యాయుల బోధన తీరు ఎలా ఉంది? విద్యార్థులకు కనీస బేసిక్స్ ఉన్నాయా? లేదోనని పరిశీలించి నివేదికలు తయారు చేయించారు. ఆ నివేదికలను రామభద్రపురం పాఠశాల ఉపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. దాదాపు అన్ని తరగతుల్లోనూ ఆడ పిల్లల విద్యాసామర్థ్యం, హాజరు శాతం బాగుందని,మగ పిల్లల్లో కనీస సామర్థ్యాలు లేకపోవడంతో పాటు వారి హాజరు శాతం బాగా లేదని గుర్తించారు. మంగళవారం కూడా సుమారు 300 మంది విద్యార్థులు గైర్హాజరు కాండంతో ఇన్‌స్పెక్షన్ తేదీని మూడు రోజులు ముందు ప్రకటించినా పిల్లల హాజరు శాతం పెంచలేకపోయారని,హెచ్‌ఎం నుంచి ఉపాధ్యాయుల వరకు ఇన్‌స్పెక్షన్ అంటే గౌరవం లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. పాఠశాలల తనిఖీ ముమ్మరం చేయాలని ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్యలను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కామేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడలిని మరింత అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని ఆడలి ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. జిల్లా పర్యాటక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడలి మంచి పర్యాటక ప్రదేశమని, దానిని ఇంకా బాగా అభివృద్ధి చేయాలని కోరారు. ఆడలి పర్యాటక కేంద్రానికి వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ స్థలం అభివృద్ధి చేయాలని, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఆడలి వ్యూ పాయింట్ బోర్డు ఏర్పాటు చేసి బ్రాండింగ్ చేయాలని సూచించారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి పర్యాటక దినోత్సవాన్ని దోహదం చేయాలని అభిప్రాయ పడ్డారు.

శంబర ప్రధాన వీధిని అభివృద్ధి చేయాలి

శంబర పోలమాంబ ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు గ్రామంలోని ప్రధానవీధి అభివృద్ధి చేయాలని కలెక్టర్ అన్నారు. ఉత్సవాలు బాగా నిర్వహించేందుకు అవసరమైతే వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జీఏపీ. ప్రసూన మాట్లాడుతూ సీతంపేట మండలంలో బెనరాయ్ వాటర్ ఫాల్స్, పొల్ల వ్యూ పాయింట్, సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటక అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం

జిల్లాలోని ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, భవనాలు, గిరిజన ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

గొడౌన్‌లో గోవులు

- దాడి చేసిన పోలీసులు
- ముగ్గురు నిందితులపై కేసు నమోదు
- రెండు బొలెరో వాహహనాలు సీజ్



తరలించేందుకు సిద్ధంగా ఉన్న గోవులను పరిశీలస్తున్న సీఐ షణ్ముఖ రావు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామ సమీపంలో గల గొడౌన్‌లో అక్రమంగా పశువులను బంధించారన్న విషయం తెలుసుకున్న సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి వెళ్లి మంగళవారం దాడి చేశారు. ఒడిశా రాష్ట్రం, మానాపురం, అలమండల సంతల నుంచి వాహనాల్లో తీసుకుని వచ్చి ఈ గొడౌన్‌లో 108 గోవులను బంధించినట్లు గుర్తించారు. వాటిని ఇక్కడి నుంచి వేరే ప్రాంతాల్లోని కబేళాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుసుకున్నామని సీఐ షణ్ముఖరావు తెలిపారు. పశువులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న 2 బొలెరో వాహనాలను సీజ్ చేసి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి గోవులను స్వాధీనం చేసకున్నట్లు సీఐ చెప్పారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- వేగావతి పరీవాహక గ్రామాల్లో మాఫియా
- అడ్డుకున్నవారిపై దాడులకు యత్నం



వేగావతినదిలో ఇసుక లోడ్ చేస్తున్న ట్రాక్టర్లు



సుధాకర్

బొబ్బిలి రూరల్: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా జరుగుతోంది. వేగావతి నది పరీవాహక గ్రామాలైన కారాడ, అలజంగి, పారాది, పెంట వంటి గ్రామాల నుంచి ట్రాక్టర్లతో ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా అధికారగణం కనీసం నిఘా కూడా పెట్టలేకపోతోంది. అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరుకాయలన్న అన్న చందంగా సాగుతోంది. ఇసుక రవాణా జరుగుతున్న ట్రాక్టర్లను ఆపుతున్న రెవెన్యూ సిబ్బందిపై మూకుమ్మడి దాడికి మాఫియా వ్యక్తులు యత్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ఇసుక అక్రమరణాపై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెబుతున్నప్పటికీ ఆచరణలోకి రావడంలేదు. అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులే గ్రామాల్లో ఈ దందాకు పూనుకుంటున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినా అధికార పార్టీ పెద్దలు వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్నది విమర్శ. వేగావతి నదినుంచి పట్టణానికి తీసుకువచ్చే ట్రాక్టర్ ఇసుకను రూ.3,500కు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ రాత్రి 7 గంటలనుంచి ప్రారంభమవుతున్న ఇసుక రవాణా తెల్లవారుజామున 4 గంటలవరకు నిరాటంకంగా సాగుతుందని ఆయా గ్రామాల్లో ఎవరిని అడిగినా చెబుతున్నారు. మరి అధికారులు పట్టుకుంటారా? అని ప్రశ్నిస్తే అధికారంలో ఉన్న వారిని ఎవరు పట్టుకుంటారంటూ పెదవి విరుస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం రెవెన్యూ అధికారులే కాకుండా పోలీసుశాఖ సైతం ఇసుక అక్రమరవాణాపై నిఘా ఉంచి పట్టుకుని కేసులు పెట్టవచ్చు. జరిమానా విధించవచ్చు. కానీ జిల్లాలో అలాంటివేమీ జరగడంలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటివరకు ఇసుక అక్రమరవాణా చేస్తూ దొరికిన ట్రాక్టర్లు, టిప్పర్లకు జరిమానా నామమాత్రంగా వేస్తున్నారే తప్ప ఇసుక అక్రమరవాణా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్న సందేశం ఇచ్చే సాహసాన్ని అధికారులు చేయలేకపోతున్నారు. దీనికి అధికార పార్టీ ద్వితీయశ్రేణి నాయకత్వమే ప్రధాన కారణమని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేగావతి నదిలో ఇసుకను ట్రాక్టర్లలో లోడ్‌వేస్తుండగా రెవెన్యూ అధికారులు దాడిచేసి అలజంగి గ్రామంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.అధికారులు దాడిచేసేసమయంలో అన్ని ట్రాక్టర్లు వేగావతి నదిలో ఉండగా వారిని చూసి నదిలోనే ఇసుకను విడిచిపెట్టారు. దీంతో ఒక ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్ 4 ఖాళీ ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సుమారు వంద మందికి పైగా తమపై దాడిచేసేందుకు ప్రయత్నించారని దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పంపించి వేశారని వీఆర్‌ఓ సుధాకర్ తెలిపారు.ఇలా దాడులకు పూనుకుంటే తామెలా ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగలమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిరోజూ జరుగుతున్న ఈ తంతు అందరికీ తెలుసని, అయినా తప్పదని భయంభయంతోనే విధులు నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బూశాయవలస విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం టి.జేమ్స్ ఇతర ఉపాధ్యాయులు

రామభద్రపురం: మండలంలోని బూశాయవలస ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 16 విభాగంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామినాయుడు తెలిపారు. ఈ నెల 8వ తేదీన నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్ల ఎంపికల్లో డి.సురేష్, బి.అంజలి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13,14,15 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎం టి.జేమ్స్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

లైంగికదాడి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

- రూ.35 వేల జరిమానా

గంట్యాడ: లైంగికదాడికి పాల్పడిన ముద్దాయికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.35వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన మద్దిల మురళి అదే గ్రామానికి చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో 2018లో అప్పటి ఎస్సై నారాయణరావు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ డి.లక్ష్మణరావు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలరు. అనంతరం ఆయనకు బదిలీ కావడంతో విజయనగరం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ కేసు దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలోకి తీసుకుని ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేవిధంగా కోర్టు తీర్పు చెప్పింది. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు. కేసులో త్వరితగతిన ముద్దాయికి శిక్షపడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు పరిస్థితి

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు, ఒడిశాలో కురిసిన వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద సోమవారం సాయంత్రానికి 3,710 క్యూసెక్కులున్న నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి 4,824 క్యూసెక్కులకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేసి 9,056 క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువలద్వారా 490 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం నదిలో సాధారణ నీటిమట్టం 105 మీటర్లకుగాను 104.02 మీటర్లలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.909 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని నీటిపారుదలశాఖ డీఈఈ టి.రఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిశోర్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో చేపల వేటకు ఎవరూ వెళ్ళవద్దని హెచ్చరికలు జారీచేశారు. ఇదిలా ఉండగా నాగావళినది తీర పరీవాహక ప్రాంత ప్రజలు నదివైపు వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

మరుగుదొడ్లను పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రమణమూర్తి

భోగాపురం: మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లను వారంలో రెండు రోజులు పరిశీలించి ఫొటోలను ప్రభుత్వానికి సంబంధించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈఓ రమణమూర్తి సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు జీపీఎస్ ఆధారంగా ఎప్పుడు ఏ సమయంలో పాఠశాలల తనిఖీకి వస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో అధికారులు పాఠశాలలు తనిఖీకి వచ్చేటప్పుడు సమాచారం అందించేవారని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. వారంలో రెండు రోజులు సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది, మరో రెండు రోజులు స్కూల్ కమిటీ సభ్యులు, మిగిలిన రెండు రోజులు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మరుగుదొడ్లను పరిశీలించి ఫొటోలను ప్రభుత్వం సూచించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ-2 బి.చంద్రమౌళి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లింగ వివక్ష రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మస్తానయ్య, డీఈఓ పగడాలమ్మ

భామిని: పాఠశాలల్లో లింగ వివక్ష ఆధారంగా జరిగే హింసను అరికట్టేందుకు టీచర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసే విధానంపై సర్వ శిక్ష, సీమాట్, రాష్ట డైరెక్టర్ డాక్టర్ వి.ఆర్, మస్తానయ్య పలు సూచనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఎంల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు,మహిళా పోలీస్‌లు,పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలని హితవు పలికారు. లింగ వివక్ష, హింస లేకుండా చూడాలని కోరారు. సామాజిక చైతన్యం కల్పించి వెనుకబడిన భామిని మండలాన్ని ఆశావహ బాటలో నడపాలని పిలుపునిచ్చారు. డీఈఓ పగడాలమ్మ, సీమాట్ ప్రొఫెసర్ కె.శారద, కైవల్య ఫౌండేషన్ ప్రతినిధి నాగమ్మ, ఏఎంఓ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఓ వి.కృష్ణమూర్తి, ఎంఈఓలు పాల్గొన్నారు.

గణనాథునికి నృత్య నీరాజనం



రామనారాయణంలో నృత్య నీరాజనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని రామనారాయణం ప్రాంగణంలో శ్రీసూర్య అకాడమీ విద్యార్థులు నృత్య నీరాజనం సమర్పించారు. అకాడమీ ఫౌండర్ టివి.రామ్‌కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులందరికీ ప్రశంసపత్రాలను, నాట్యగురువులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కళ్లికోట పరిసరాల్లో గజరాజుల గుంపు

కొమరాడ: నాగావళి నది ఆవైపు ఉన్న ఏడు ఏనుగుల గుంపు మంగళవారం కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాల పరిసరాల్లో సంచరిస్తున్నాయి. ఆర్తాం, గుణానుపురం, దుగ్గి, కళ్లికోట తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమగ్నం చేసే వారంతా అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి బాణసంచా శబ్దాలు చేయకుండా ఏనుగుల గుంపు సమాచారం తెలుసుకుని జాగ్రతగా నిమజ్జనం చేసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే ఆర్తాం నుంచి కళ్లికోట రహదారిపై వచ్చే ప్రజలు రాత్రి పూట ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రతలు పాటించాలని అటవీశాఖ సిబ్బంది కోరుతున్నారు.